క్లుప్తంగా

పెద్దమ్మకు పూజలు



డోర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా గౌస్



గౌస్‌బాషాను అభినందిస్తున్న స్వర్ణకారులు

చాగలమర్రి: మండల స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా దావల్జిగారి గౌస్‌బాషా 40 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆదివారం స్థానిక చిన్న మకానంలోని స్వర్ణకారుల సంఘం కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఐదుగురు అధ్యక్ష పదవికి పోటీలో నిలిచారు. 238 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. త్వరలోనే మండల కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల కన్వీనర్ కె.అబ్దుల్లా, ట్రెజరర్ సాదక్‌వలి తెలిపారు. గౌస్‌ను పలువురు స్వర్ణకారులు అభినందించారు.

మొదలైన క్రిస్మస్ సందడి



క్రిష్టిపాడులో ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు

డోర్నిపాడు: నెల ముందు నుంచే పల్లెల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. డిసెంబర్ 25న క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచి డప్పు వాయిద్యాలతో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ వీధుల్లో ప్రార్థనలు చేస్తారు. ఇలా నెల పాటు ప్రతి రోజూ చేయడం సంప్రదాయంగా వస్తోంది.

విప్లవ వీరుడికి ఘన నివాళి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉయ్యాలవాడ: స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 218వ జయంతిని ఆదివారం ఉయ్యాలవాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో నరసింహారెడ్డి విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటీష్ వారి నుంచి విముక్తి కోసం నరసింహారెడ్డి చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చితే నేటి బాలలకు కూడా చరిత్ర తెలుస్తుందన్నారు. ఉయ్యాలవాడలో నరసింహారెడ్డి మెమోరియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

గోస్పాడు ప్రభుత్వాసుపత్రిలో వసతులు కల్పించాలి

గోస్పాడు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ మండల నాయకులు జిలానీ బాషా, హరినాథ్ కోరారు. ఆదివారం గోస్పాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి ఉందని, అయితే పూర్తిస్థాయి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం నాలుగు పడకలు ఆసుపత్రిగా ఉండి కనీస వసతులు కరువయ్యాయన్నారు. ఆసుపత్రి పరిధిలో 18 గ్రామాలు ఉన్నాయని, ఇందులో ఇద్దరు డాక్టర్లు సేవలు అందిస్తున్నారన్నారు. ఆసుపత్రి స్థాయిని పెంచి వైద్యుల సంఖ్యను పెంచి మెరుగైన సేవలు అందించాలన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26వ తేదీన చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో చౌడప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు శంకర్, ఉపాధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10 కార్మిక సంఘాలు 500 రైతు సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐటీయూజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, శ్రీనివాసులు డిమాండ్ చేశారు.రఫీ, యాకూబ్, శంకర్‌లతో పాటు రంజీత్, ప్రతాప్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

వరి రైతు కుదేలు

- రైతులకు కలిసిరాని ఖరీఫ్ సాగు
- ప్రారంభమైన వరి కోతలు
- పంటపై తీవ్ర ప్రభావం చూపిన తుపాన్
- తగ్గిన దిగుబడులు



రూపనగుడి సమీపంలో యంత్రం సహాయంతో వరి పంట నూర్పిడి

ఉయ్యాలవాడ: వరి రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసి రాలేదు. సరిగ్గా పంట చేతికి వచ్చే తరుణంలో ఈ నెల ప్రారంభంలో తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా 5 రోజులు వర్షం కురిసింది. పంట నూర్పిడి సమయం ఆసన్నం కాగా ఈ నెలలో మళ్లీ 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఈదురు గాలులు వీచడంతో వరి పంట నేలవాలింది. దీంతో వరి రైతుల ఆశలు అడియాసలు అయ్యాయి. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని 14 గ్రామాల్లో కుందూతీరం వెంట 1100 హెక్టార్లలో రైతులు నంద్యాల, కర్నూలు సోనా, 555 రకానికి చెందిన వరి సాగు చేశారు. మాయలూరు, బోడెమ్మనూరు, సుద్దమల్ల, రూపనగుడి, కాకరవాడ గ్రామాల్లో నూర్పిడి పనులు మొదలయ్యాయి. ఎకరాకు 32 నుంచి 36 బస్తాలు దిగుబడులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

ఈసారి కలిసి రాని సాగు

గత ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చి మార్కెట్‌లో కూడా మంచి ధర లభించడంతో ఈ ఏడాది చాలా మంది రైతులు వరి సాగు చేశారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 855 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1100 హెక్టార్లలో సాగు చేశారు. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేలు ఖర్చు చేశారు. కౌలు రైతులు ఎకరాకు రూ. 25 వేలు ముందస్తు కౌలు చెల్లించి తీసుకున్నారు. గత ఏడాది సకాలంలో వర్షాలు, సాగు నీటి వనరులు, వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు దిగుబడులు లభించాయి. గ్రేడ్–1 రకం క్వింటా రూ. 2,203, గ్రేడ్–2 రకం రూ. 2,185 ప్రభుత్వం నిర్ణయించింది. దిగుబడులు కూడా ఆశాజనకంగా రావడం ఆశించిన స్థాయిలో ధర లభించడంతో పెట్టుబడులు పోను రైతులకు ఆదాయం చేకూరింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ధాన్యం అమ్ముదామనుకుంటే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. ప్రైవేట్ వ్యాపారులు బస్తా రూ. 1400 నుంచి రూ. 1500లోపు కొంటున్నారు. ఈ ధరకు విక్రయిస్తే కనీసం పెట్టుబడులు కూడా రావాని అంటున్నారు. ఈ నెల మళ్లీ 26, 27 తేదీల్లో తుపాన్ ప్రభావం ఉందని వాతావరణ శాఖ తెలపడంతో చాలా మంది రైతులు పంటను అమ్మకోలేక ఇంట్లో నిల్వ చేసుకోలేక అవస్థలు పడుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నాకున్న 20 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఈ ఏడాది పంటకు గిట్టుబాటు ధర లేదు. గత ఏడాది ఎకరాకు 40 బస్తాలు దిగుబడులు వచ్చాయి. బస్తా రూ. 2,250కు విక్రయించాను. ఈ ఏడాది తుపాన్ ప్రభావంతో పంట దిగుబడులు కూడా తగ్గాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించి వరి రైతులను ఆదుకోవాలి.

– పుల్లారెడ్డి, రైతు, రూపనగుడి

గిట్టుబాటు ధర లేదు



ఈ ఏడాది 8 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఎకరాకు ముందస్తు కౌలు రూ. 25 వేలు, పంట సాగు కోసం రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు, పంట నూర్పిడి కోసం రూ. 30 వేలు పెట్టాను. మార్కెట్‌లో బస్తా రూ. 1450లోపే ఉంది. పంట నూర్పిడి చేస్తున్నాను. 35 బస్తాలలోపు దిగుబడులు వస్తున్నాయి. ఈ ధరకు విక్రయిస్తే కనీస పెట్టుబడులు కూడా లభించవు.

– నాగరాజు, కౌలు రైతు, మాయలూరు

రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్న కొందరు రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఆలిండియా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.

అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలను అసోసియేషన్ దృష్టికి తేవాలని చెప్పారు. ఉపాధ్యక్షుడు శీను, కార్యదర్శి పోలిరెడ్డి, రాజారావు, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఆ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. ఆదివారం ఎన్‌జీఓ కాలనీలోని స్థానిక కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలు పెరిగాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటే మధ్యంతర భృతి పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. డిజేబుల్స్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, అధ్యక్షుడు మరియదాసు, కార్యదర్శి జహీరుద్దీన్, కోశాధికారి జలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



ఎన్‌సీసీ విద్యార్థులతో హెచ్‌ఎం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్‌ఎం పురపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ డే ఉత్సవాలను ప్రధానోపాధ్యాయులు అసదుల్లా హుసేన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ జీవితంలో క్రమశిక్షణ, సమాజంలో ఎలా నడుచుకోవాలనే విషయాన్ని నేర్పిస్తుందని, ఎన్‌సీసీ వల్ల విద్యార్థులు క్రమశిక్షణ, దేశం పట్ల గౌరవాన్ని నేర్చుకొని నేషన్ ఫస్ట్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎన్‌సీసీ కేడిట్స్ బాలురు 100 మంది, బాలికలు 50 మంది ఉత్సవాల్లో పాల్గొనగా వారికి ఎన్‌సీసీ–ఏ సర్టిఫికెట్‌ను హెచ్‌ఎం అందజేశారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, వంద మీటర్ల రన్నింగ్ రేస్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ ఆఫీసర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అమరావతి నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ అమరావతి నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ పీఆర్సీ వేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల కోసం సర్వీసు రూల్స్ తీసుకువాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగార్జున, అదనపు కార్యదర్శిగా వీరన్న, కోశాధికారిగా మౌలాలి, ఉపాధ్యక్షులుగా సుబ్బరాయుడు, సదాశివయ్య, బాలకోటిరెడ్డి, కార్యదర్శులుగా అల్తాఫ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నాగూర్ ప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రతినిధులు నాగూర్‌ప్రసాద్, సూర్యుడు తెలిపారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి మానిపాటి సూర్యుడు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక టూటౌన్ పోలీ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు నేరప్రవృత్తి మానుకుని ప్రశాంతంగా జీవించాలని సూచించారు. వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచటంతో పాటు వారి ప్రవర్తన ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించామన్నారు. అలాగే వారి జీవనశైలిపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీఐలు ఇస్మాయిల్, సూర్యమౌళి, సుధాకర్‌రెడ్డి, అస్రార్‌బాషా ఉన్నారు.

ముస్లిం సమాజాభివృద్ధికి మిల్లీ కౌన్సిల్ కృషి



మాట్లాడుతున్న అబ్దుల్‌మజీద్

నంద్యాల(అర్బన్): ముస్లింల సమాజాభివృద్ధికి మిల్లీ కౌన్సిల్ కృషి చేస్తుందని ఆలిండియా మిల్లీ కౌన్సిల్ నంద్యాల జిల్లా గవర్నర్ మౌలానా అబ్దుల్ మజీద్ తెలిపారు. కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు గౌస్ అధ్యక్షతన ఆదివారం స్థానిక కార్యాలయంలో కౌన్సిల్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 8న ఎన్‌జీఓ కాలనీలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా కార్యదర్శి హఫీజ్ సలీం పర్వేజ్, నాయకులు ఉస్మాన్‌బాషా, ఫయాజ్, రఫీ, మస్తాన్, రజాక్, సులేమాన్, అబూబకర్ పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన మహానంది



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది: కార్తీకమాసం, సెలవురోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ, ఉచిత దర్శనానికి భక్తులకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల కౌంటర్లు, వసతిగృహాలు, అభిషేకాలు, నోములు, ఇతర విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు రూ. 15లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

మహానందీశుడి సన్నిధిలో..

నంద్యాల మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.వాసు, కుటుంబ సభ్యులు మహానందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. వారికి పూజలు నిర్వహింప జేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

చలికాలంలో జాగ్రత్త సుమా!



చలిమంటలు వేసుకున్న గ్రామస్తులు

డోర్నిపాడు: వారం నుంచి చీకటి పడగానే చలి వణికిస్తోంది. వేకువజామున ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో చలి ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు చలివీచే సమయంలో బయటకు రాకుండా చూసుకోవాలని వైద్యాధికారి నాగేంద్ర సూచించారు. చిన్నపిల్లలకు వెచ్చని దుస్తులు తప్పనిసరిగా ధరించేలా చూసుకోవాలన్నారు. అలాగే ముఖ్యంగా తల్లి ఒడిలో నిద్రించేలా చూసుకోవాలన్నారు. చలిమంటల వద్ద చాలా జాగ్రత్తగా ఉండాలని, చలికాలంలో కాలిన గాయాలు మానాలంటే చాలా సమయం పడుతుందని తెలిపారు.



యాదవ సంఘం ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



రెడ్డి సంఘం ఆధ్వర్యంలో దీపారాధన చేస్తున్న మహిళలు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- సందడిగా కార్తీక వనభోజనాలు



జాతీయ అవార్డు గ్రహీత సతీష్‌ను సన్మానిస్తున్న పద్మశాలీయ సంఘం నాయకులు



వీరశైవ సంఘం కార్తీక వన భోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక వనభోజనాలు ఆధ్యాత్మికతతో పాటు ఉల్లాసంగా సాగుతున్నాయి. ఆదివారం పట్టణంలో రెడ్డి, పద్మశాలీయ, లింగాయత్, రజక, యాదవ కుల సంఘాలు కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా సంఘాలు ముందుగా ఉసిరి చెట్టు, తులసి మొక్కకు పూజలు చేశారు. సామూహిక భోజనాల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ ఆర్కెస్ట్రా పాటలు, చిన్నారుల భగవద్గీత పోటీలు, విచిత్ర వేషధారణలు తదితర కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

నంద్యాల శివారులోని మూలమఠంలో రెడ్ల సంఘం ఆధ్వర్యంలో ఆర్‌వీ సుబ్బారెడ్డి అధ్యక్షతన వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. జబర్దస్త్ టీం సభ్యుల హాస్య సన్నివేశాలు అలరించాయి. మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రామకృష్ణారెడ్డి, ఎన్‌హెచ్ శివారెడ్డి, న్యాయవాది శ్రీదేవి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వీరశైవ సంఘం ఆధ్వర్యంలో..

కోటవీధిలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో సమారాధన కార్యక్రమం నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రప్రసాద్, శశిభూషణ సిద్ధాంతిని ఘనంగా సత్కరించారు.

రజక సంఘం ఆధ్వర్యంలో..

బైటిపేటలోని గంగా భవానీ ఆలయంలో గంగాదేవీకి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు మాట్లాడుతూ గంగాభవానీ ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం లక్కీడిప్‌లో గెలుపొందిన మహిళలకు చీరలు అందజేశారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..

శ్రీభద్రతావతి భావనారుషి దేవాలయంలో గాజుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇటీవల జాతీయ అవార్డు అందుకున్న బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జీవీ సతీష్‌ను సత్కరించారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో..

పద్మావతి నగర్‌లో వెలసిన శ్రీకృష్ణ భగవాన్ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, భగవద్గీత ప్రవచనాలు, ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి.

⇨ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సూర్యనందిలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఆపస్ రాష్ట్ర సహ కోశాధికారి ఏ. కృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్న వివేకానంద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మధుకిరణ్ కోరారు. ఆయన మాట్లాడుతూ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. డీఈఓ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఇరువురిపై కేసు నమోదు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో శనివారం జరిగిన దాడి ఘటనలో అదే గ్రామానికి చెందిన దేరంగుల లక్ష్మీనరసింహుడు, అతని భార్యపై చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. చింతలచెరువు గ్రామంలో రస్తా విషయమై జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహులు, భార్య సుబ్బలక్ష్మీ, కుమారుడు భార్గవ నరసింహులుపై అదే గ్రామానికి చెందిన దేరంగుల లక్ష్మీనరసింహుడు, అతని భార్య లక్ష్మీదేవి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డారు. లక్ష్మీనరసింహులు తలకు బలమైన గాయం కావడంతో నంద్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలించినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్ 1న కార్తీక వనభోజనం

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బలిజ సంఘీయుల కార్తీక వనభోజన కరపత్రాలను ఆదివారం స్థానిక బాలా అకాడమీ ఆవరణలో విడుదల చేశారు. సంఘం నాయకులు పసుపులేటి నారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీన స్థానిక మూలమఠం భీమలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధనుంజయుడు, రవీంద్ర, వెంకటేశ్వర్లు, పసుపులేటి జనార్దన్, శ్రీనివాసులు, రామయ్య, చలంబాబు, కృష్ణయ్య, దస్తగిరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితానే లక్ష్యం



ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ విశ్వనాథ్

ఆళ్లగడ్డ: ఓటరు జాబితాలో తప్పులు, అక్షర దోషాలు లేకుండా పేర్లు నమోదు అయ్యేలా బీఎల్వోలు శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నమోదు శిబిరాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటరు నమోదు కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా బీఎల్వోలదే బాధ్యత అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానికంగా లేని ఓటర్లు, జాబితాలో ఒకేపేరు రెండు సార్లు ఉన్నా తొలగించాలని సూచించారు. పేరు చిరునామా తప్పుగా ఉన్నా మార్చుకోవాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ రత్న కుమారి ఉన్నారు.

ఓటరు నమోదుకు 70 దరఖాస్తులు

ఉయ్యాలవాడ: మండలంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 70 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ ప్రసాద్‌బాబు తెలిపారు. ఫారం –6 కింద 22, ఫారం–7 కింద 4, ఫారం–8 కింద 44 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు.



పుసులూరు సమీపంలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

పడిపోతేనే పట్టించుకుంటారా?

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, తీగలు రైతులను భయపెడుతున్నాయి. స్తంభాలు ఒరిగిపోవడం, తీగలు వాలిపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గుంతనాల, పుసులూరు, బ్రాహ్మణపల్లె, పోలూరు, భీమవరం, పెద్ద కొట్టాల, పులిమద్ది, రాయమాల్పురం, తదితర గ్రామాల్లోని పొలాల్లో ఉన్న స్తంభాలు ఒరిగి ఆందోళన కలిగిస్తున్నాయి. తీగలు చేతులకు తగిలేంత ఎత్తులో కిందకు వేలాడుతున్నాయి. స్తంభాలు, తీగలను సవరించాలంటూ పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భీమవరం వద్ద నేలకు వాలిన విద్యుత్ తీగలు